సాక్షి ఒడిశా

మంగళవారం । 2 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.81,756లు వచ్చాయని అధికారులు తెలిపారు.



విన్నపాలు వినవలే..!

రాష్ట్రంలో సుదీర్ఘ కాలం తర్వాత ప్రజా ఫిర్యాదుల విభాగం మరలా ప్రారంభమైంది.

- 8లో



కొత్త న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తాం

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని డీఐజీ చరణ్ సింగ్ మీనా తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శిగా నికుంజ బిహారీ ధొలొ



భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి నికుంజ బిహారీ ధొలొ నియమితులయ్యారు. ఆయన ఒడిశా కేడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ)గా పని చేస్తున్నారు. గతేడాది మార్చి నెలలో సీఈవోగా నియమితులయ్యారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మరియు హోం శాఖ ఎక్స్ అఫీషియో అదనపు ప్రముఖ కార్యదర్శి నికుంజ బిహారీ ధొలొ ముఖ్యమంత్రికి అదనపు ప్రముఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. సాధారణ పాలన మరియు ప్రజాభియోగాల విభాగం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వంలో అనేక బాధ్యతాయుతమైన పదవుల్లో బాధ్యతలు నిర్వహించారు. సీఈవోగా నియమించబడక ముందు ఆయన ఇంధన శాఖ అదనపు ప్రముఖ కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ)గా పని చేశారు. నికుంజ బిహారీ ధొలొ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రంలో ఏకకాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

వీడిన చిక్కుమడి



సీసీ టీవీ ఫుటేజీలో సస్మితా మృతదేహంతో దీప్తి రంజన్

కొరాపుట్: సునాబెడా ప్రభుత్వ ఆస్పత్రిలో బాలిక మృతదేహం కేసు చిక్కుముడి వీడింది. ఈ ఘటనపై కొరాపుట్ జిల్లా సునాబెడా పోలీసులు సోమవారం వివరణ ఇచ్చారు. నయాగఢ్ జిల్లాకి చెందిన దీప్తి రంజన్ నాయక్ భారతమాల ప్రాజెక్ట్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. సిమిలిగుడ సమితి పట్టగుడకి చెందిన రాం కిలో, భద్రమా సమారెడి దంపతులు తమ కుమార్తె సస్మితా కిలో (4)ని తమకు పరిచయం ఉన్న దీప్తి రంజన్ నాయక్ వద్ద వదలి బయటకు వెళ్లారు. అదే సమయంలో సస్మిత ఒక్కసారిగా అచేతన స్థితికి వచ్చి పడిపోయింది. వెంటనే దీప్తి రంజన్ భయంతో సమీప ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకెళ్లాడు. అయితే అక్కడ సిబ్బంది చికిత్సకి నిరాకరించడంతో సునాబెడా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అప్పటికే బాలిక మృతి చెందడంతో భయంతో మృతదేహాన్ని వదిలి పరారయ్యాడు. ఆస్పత్రిలో సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా బాలిక తల్లిదండ్రులను రప్పించి పోలీసులు విచారణ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి దీప్తి రంజన్‌ని అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణలో బాలికది అనారోగ్య మరణంగా తేలింది.

హైదరాబాద్‌లో వలస కూలీ మృతి



మన్మతి హరిజన్(ఫైల్)

కొరాపుట్: పొట్టకూటి కోసం హైదరాబాద్‌కు వలస కూలీగా వెళ్లిన నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి చిట్టాబెడా గ్రామానికి చెందిన పద్మన్ హరిజన్ భార్య మన్మతి(55) హైదరాబాద్‌లో అనారోగ్యంతో సోమవారం చనిపోయింది. గత పాతికేళ్లుగా ఈ దంపతులు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. ఇటీవల మన్మతికి ఒక్కసారిగా వాంతులు, విరోచనాలు అవ్వడంతో అనారోగ్యంతో ఇంట్లో చనిపోయింది. వారిని పనిలో పెట్టుకున్న కాంట్రాక్టర్ ఒక అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన వేలాది మంది హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వలస కూలీలుగా పని చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సుంకి వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. సోమవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి సుంకి గేటు వద్ద విగ్రహాన్ని జాతికి అంకితం చేశారు. స్థానిక జై భీం సభ్యులు దీనిని ఏర్పాటు చేశారు. ముందుగా సుంకి సరిహద్దు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం, కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా, జయపూర్‌కి చెందిన జైభీం సంస్థ నాయకురాలు మనశ్విని టక్రి తదితరులు పాల్గొన్నారు.

కమ్మరే కీలకం..!

- శ్రీజగన్నాథుని రథ తయారీలో కమ్మరి
- రథాల కోసం 70 రకాల మేకులు
- అతి చిన్నమేకు 2 అంగుళాలు
- అతి పెద్దమేకు నాలుగున్నర అడుగులు



జొంఘా మేకు తయారీలో కమ్మరి సేవకులు

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని రథయాత్రలో అందరూ పాత్రధారులే. ఎవరి పాత్ర వారికే ప్రత్యేకం. స్వామి సేవ తరతరాలుగా పూర్వీకుల నుంచి అభ్యసించిన వారికి మాత్రమే దక్కుతుంది. యాత్రలో అత్యద్భుత ఘట్టం రథాల తయారీ. ఏటా కొత్తగా 3 భారీ రథాలు తయారు చేస్తారు. ఈ ప్రక్రియలో వడ్రంగుల పాత్రకు గట్టి పట్టు కల్పించే కీలక పాత్రధారులు కమ్మరి (ఓరుఘా మహరణ) సేవకులు. రథ తయారీ శాల చేరువలో డోల మండపం ప్రాంగణంలో ఏటా కమ్మరి శాల తాత్కాలికంగా ఏర్పాటు అవుతుంది. నింగిని తాకేట్లు తలపింపజేసే నిలువెత్తు రథాలను నిలబెట్టడంలో కమ్మర సేవకులు మలచిన ఇనుప కడ్డీ మేకులు కీలకం. ఒక్కో రథం తయారీలో సమగ్రంగా 70 రకాల మేకులు వినియోగిస్తారు. 2 అంగుళాల అతి చిన్నమేకు మొదలుకొని అతి పెద్ద నాలుగున్నర అడుగుల మేకు వరకు రథాల పటిష్టత కోసం వినియోగిస్తారు. అతి పొడవైన మేకుని జొంఘా అని పేర్కొంటారు. దీని వ్యాసం 25 మిల్లీ మీటర్లు. ఒక్కో రథానికి 4 చొప్పున 4.5 అడుగుల జొంఘా మేకులు అవసరం. పలు రకాల చిన్న, పెద్ద మేకులతో ఫోర్కు, క్లాంప్ వంటి ఇనప పరికరాలను ఓరుఘా మహరణ సేవకులు సిద్ధం చేస్తారు.

అక్షయ తృతీయ నుంచి ఆరంభం

రథాల తయారీ మాదిరిగా మేకుల తయారీ పనులను ఏటా పవిత్ర అక్షయ తృతీయ నుంచి ప్రారంభించడం ఆచారంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా దేవస్థానం అధికార యంత్రాంగం ఇనుప కడ్డీలు, రేకులను సరఫరా చేస్తుంది. రథాల ఇరుసు, స్తంభాల పటిష్టత కోసం వినియోగించే బలమైన మేకులను గొండా అని పేర్కొంటారు. శ్రీజగన్నాథుని నంది ఘోష్ రథం తయారీలో 10, బలభద్రుని తాళ ధ్వజం కోసం 9 మరియు దేవీ సుభద్ర దేవ దళనం తయారీలో 7 చొప్పున గొండా మేకులను వినియోగిస్తారు. రథం పైనుంచి దాదాపు కింద వరకు మొత్తం రథ భాగాలను అనుసంధాన పరిచి పటిష్టంగా నిలబెట్టడంలో గొండా మేకుల వినియోగం అత్యంత ప్రాధాన్యం. 3 రథాల కమ్మరి కార్యకలాపాల కోసం 17 మంది కార్మికులను నియమించారు. నిత్యం సూర్యాస్తమయం వరకు నిరవధికంగా వీరు శ్రమిస్తున్నారు. వడ్రంగి సేవకులు కలప పనులను పూర్తి చేసే విడి భాగాల అమరిక కోసం అవసరమైన కొలతల మేకులను సకాలంలో కమ్మరి సేవకులు సిద్ధం చేయడంలో స్పష్టమైన సమయపాలనకు కట్టుబడి ఉంటారు. నందిఘోష్ మరియు తాళ ధ్వజం కార్యకలాపాల్లో 6 మంది చొప్పున, మిగిలిన 5 మంది కార్మికులు దేవీ సుభద్ర తాళ ధ్వజం పనుల్లో పాలుంచుకుంటున్నారు. రథాల కోసం మేకులను తయారు చేయడంతో పాటు యాత్రకు బయల్దేరే ముందు రథాలపై తెర (చాందువా) కట్టడం కూడ వీరి వంతే.



కమ్మరి సేవకులు తయారు చేసిన క్లాంప్‌లు



రథాల కోసం తయారైన మేకులు



మేకుల తయారీలో ఓరుఘా మహరణ సేవకులు

పుస్తక పఠనం అలవాటుగా మారాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

- సినీ నటుడు సురేంద్రపాల్ సింగ్

జయపురం: ప్రతి ఒక్కరికీ పుస్తక పఠనం ఒక అలవాటుగా మారాలని సినీ నటుడు సురేంద్రపాల్ సింగ్ అన్నారు. స్థానిక శివ శంకర పంకజ హాల్‌లో మానవ వికాసానికి సంబంధించి మానసిక శిక్షకుడు జోగేంద్ర కుమార్ సామంతరాయ్ రచించిన మూడు పుస్తకాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. పుస్తక పఠనంతో ప్రపంచ విజ్ఞానం లభిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ జోగేంద్ర కుమార్ సామంతరాయ్ రచించిన ఈ పుస్తకాలు సమాజానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. ప్రముఖ సాహిత్యకుడు ప్రదీప్ మిశ్ర ఆ పుస్తకాలను సమీక్షించి పుస్తకాల ప్రాధాన్యత, రచయిత పుస్తకాల్లో పొందుపరచిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి, సీనియర్ జర్నలిస్టు సీహెచ్ శాంతాకర్, కోట్‌పాడ్‌కు చెందిన చలన చిత్ర నటుడు ప్రకాశ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు చేపట్టిన సీఎస్ మనోజ్ అహూజా



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహూజా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సోమవారం తొలిరోజు కార్యకలాపాలు పురస్కరించుకుని తోటి కార్యదర్శులతో పరిచయ సమావేశం ఏర్పాటు చేశారు. లోక్‌సేవా భవన్‌లోని అన్ని విభాగాల అదనపు ప్రముఖ కార్యదర్శులు, ప్రిన్సిపల్ కార్యదర్శులు, కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యకలాపాల సంబంధిత అంశాలను చర్చించారు. అభివృద్ధి కమిషనర్, అదనపు ప్రముఖ కార్యదర్శి అనూ గర్గ్ స్వాగత ప్రసంగం చేసి కొత్త చీఫ్ సెక్రటరీ సుదీర్ఘ పరిపాలనా అనుభవాన్ని తోటి కార్యదర్శులకు వివరించారు. ఒడిశాలో పాలన వ్యవస్థకు చక్కని గుర్తింపు ఉందని, కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఎన్నికల హామీలను దృష్టిలో ఉంచుకుని వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపై మనోజ్ ఆహుజా ఉద్బోధించారు. అనంతరం రానున్న బడ్జెట్ సమర్పణ, పూరీ రథయాత్ర నిర్వహణ, రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. వివిధ శాఖల పనుల్లో ప్రణాళికలు, కార్యక్రమాల అమలులో చిన్న చిన్న సమస్యలున్నాయని, సృజనాత్మకత, పారదర్శకత, చక్కటి పరిపాలన దిశగా పనులు జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

•వైద్యో నారాయణో హరీ..!



మానవాళికి వైద్యులు అందిస్తున్న సేవలు నిరుపమానమైనవని చెబుతూ వైద్యుల దినోత్సవం శుభాకాంక్షలతో ప్రఖ్యాత సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో సైకత శిల్పం ఆవిష్కరించారు.

- భువనేశ్వర్

ప్రొక్లెయినర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహంతో ఆందోళన చేస్తున్న స్థానికులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం జయపూరిగూడ వీధి వద్ద ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ప్రొక్లెయినర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి జయపూరిగూడ వీధికి చెందిన రామ్‌సింగ్ ఖోర(38) భోజనం అనంతరం ఏదో కొనేందుకు దుకాణానికి వెళ్లాడు. అయితే ఆ సమయంలో అటుగా అతివేగంగా వచ్చిన ప్రొక్లెయినర్ వాహనం బలంగా ఢీకొంది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు చూసి మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఐఐసీ రీగాన్‌కీండో వెంటనే తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే రామ్‌సింగ్ కుటుంబ సభ్యులు మృతదేహంతో స్థానికుల సాయంతో రస్తారోకో నిర్వహించారు. ప్రొక్లెయినర్ ఓనర్‌తో మాట్లాడి నష్టపరిహారం ఇప్పిస్తామని పోలీసులు చెప్పడంతో శాంతించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరారైన డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

• సీఎం మోహన్ చరణ్‌తో సీఎస్ భేటీ



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎస్ మనోజ్ ఆహుజా



సీఎం మోహన్ చరణ్‌తో నికుంజ బిహారి ధొలొ

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ మనోజ్ ఆహుజా, ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శి నికుంజ బిహారి ధొలొలు సీఎం మోహన్ చరణ్ మాఝితో సోమవారం భేటీ అయ్యారు. వీరిరువురు స్థానిక రాష్ట్ర అతిథి భవనంలో ముఖ్యమంత్రితో కాసేపు సంభాషించారు.

–భువనేశ్వర్

డాబుగాం ఎమ్మెల్యే పెద్ద మనసు



గిరిజన మహిళలతో కలిసి ఎమ్మెల్యే మనోహర్ నృత్యం

కొరాపుట్: వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే గిరిజన మహిళలకు సాయం చేస్తూ డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి పెద్ద మనసు చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. వర్షాధారిత నబరంగ్‌పూర్ జిల్లాలో గిరిజనులు రోజంతా పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. పనుల్లో ఉన్నప్పుడు వర్షాలు కురుస్తుండడంతో తడుస్తూనే ఇబ్బంది పడుతూ పనులు చేపడుతున్నారు. ఉదయం నుంచి పనుల్లో ఉండడం వలన ఇంటికి వెళ్లి తినే పరిస్థితి లేక రోజంతా ఆకలితో పొలానికే పరిమితం అవుతున్నారు. సామాజిక కట్టుబాట్లు ఎక్కువగా పాటించే గిరిజనులు ఇంటి నుంచి ఆహారాన్ని పొలానికి తీసుకెళ్లేందుకు ఇష్టపడరు. ఇవన్నీ గమనించిన ఎమ్మెల్యే మనోహర్ మహిళల కష్టాన్ని తగ్గించేందుకు రంగంలోకి దిగారు. పనుల వద్దకే వెళ్లి వారు తడిసిపోకుండా వేసుకోవడానికి పాలిథిన్ వస్త్రాలు అందజేస్తున్నారు. అంతే కాకుండా బిస్కెట్లు, మిక్సర్ తదితర పొడి ఆహారాలు సమకూరుస్తున్నారు. తన వాహనంలో టీ తయారీకి అవసరమైన సామగ్రి తీసుకెళ్లి అక్కడే వారికి వేడివేడి టీ కూడా అందజేస్తున్నారు. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా ఆయన ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మొత్తం వ్యవసాయ పనులు ముగిసేంతవరకు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించడానికి ముందస్తు ప్రకటన వెలువడింది. మనోహర్ రంధారి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన గిరిజనుడు కావడంతో ఈ సమస్యపై అవగాహన ఉంది.



బిస్కెట్లు, మిక్సర్ పంపిణీ చేస్తున్న దృశ్యం



పాలిథిన్ వస్త్రాలతో మహిళలు

మహిళపై దాడి కేసులో నలుగురు అరెస్టు

జయపురం: ఒక భూ వివాదంలో మహిళపై మారణాయుధాలతో దాడి చేసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేసినట్లు స్టేషన్ అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు. అరెస్టైనవారు జయపురం సమితి ధన్‌పూర్ గ్రామానికి చెందిన సదా నాయిక్, అతడి కుమారులు పూర్ణ నాయిక్, సాను నాయిక్, అతని సోదరుడు ధనపతి నాయిక్‌లుగా వెల్లడించారు. వారి నుంచి మహిళపై దాడికి వినియోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన నయినీ నాయిక్ పోలీసులకు చేసిన ఫిర్యాదు ప్రకారం.. నిందిత కుటుంబ, నయినీ నాయిక్ కుటుంబాలు బంధువులు. ఆ రెండు కుటుంబాల మధ్య గత 30 ఏళ్లుగా భూ తగాదాలు ఉన్నాయి. ఆ వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. జూన్ 29వ తేదీన మధ్యాహ్నం నయినీ పొలంలో పనిచేస్తోంది. ఆ సమయంలో నిందితులు నలుగురు అక్కడికి వచ్చి తమ భూమిలో ఎందుకు పంట వేస్తున్నావని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటలు పెరిగి వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఆమెను నిందితులు అసభ్య పదజాలంతో తిడుతూ మారణాయుధాలతో దాడి జరిపారు. రక్తసిక్తమైన నయినీని పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను వార్డులో చేర్చారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.



సదా నాయిక్



ధనపతి నాయిక్



సాను నాయిక్



పూర్ణ నాయిక్

సమస్యల పరిష్కారంపై దృష్టి

- రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్
- రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టులపై సమీక్ష
- త్వరలో సీఎంతో సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే (ఈకోర్)లో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలియజేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టులపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమగ్ర సమావేశం సోమవారం నిర్వహించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ పురోగతి మరియు ఆందోళనకు సంబంధించిన పలు కీలకాంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కొనసాగుతున్న ప్రాజెక్టుల్లో సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, పరిష్కారాన్ని పేర్కొన్నారు. ఖుర్దా రోడ్ – బొలంగీర్ రైలు మార్గాన్ని త్వరగా పూర్తి చేయడానికి, రెండు వైపుల నుంచి సొరంగం పనులు చేపతామన్నారు. ఈ మార్గంలోని జాతీయ రహదారిని దాదాపు 7 కిలో టర్ల మేర భారీ సొరంగాలతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తద్వారా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తాల్చేర్ – బిమలాగడ్ కొత్త లైన్ నిర్మాణ పనులు, తాల్చేర్ వైపు నుంచి మరియు బిమలాగడ్ వైపు నుంచి ఏకకాలంలో జరుగుతాయని వెల్లడించారు. రైల్వేశాఖ సమీప భవిష్యత్తులో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనుందన్నారు.

అమృత్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి

అమృత్ స్టేషన్ల పునరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ తెలియజేశారు. అమృత్ స్టేషన్‌ల నిర్మాణ పనులకు సంబంధించి సమీక్ష త్వరలో జరగనుందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఒడిశాపై ప్రత్యేక దృష్టి సారించారని వెల్లడించారు. రైల్వే రంగంలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కనీవిని ఎరుగని స్థాయిలో అత్యధికంగా రూ.10,536 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను రైల్వే నెట్‌వర్క్‌లో అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గత 10 సంవత్సరాల్లో ఒడిశాలో 1,826 ట్రాక్ కిలోమీటర్ల రైలు మార్గం నిర్మించబడిందన్నారు. ఇది శ్రీలంకలోని మొత్తం రైలు నెట్‌వర్క్ కంటే ఎక్కువని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 500 కి.మీల రైలు మార్గం నిర్మాణం కోసం తూర్పు కోస్తా రైల్వేకి లక్ష్యంగా నిర్ధారించారు. సమావేశంలో తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, తూర్పు కోస్తా రైల్వే అన్ని విభాగాల అధికారులు, ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్. బజ్వా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దశ మూలికల మోదకం సమర్పణ


స్వామివారి వైద్యం కోసం తయారైన దశ మూలికల మోదకం

భువనేశ్వర్: అనవసర 10వ దినం పురస్కరించుకుని శ్రీమందిరానికి సోమవారం దశ మూలికల మోదకం పంపిణీ చేశారు. స్వామి అస్వస్థత నయం చేసేందుకు కవిరాజ్ ఔషధ సేవకులు నియమ నిష్ఠలతో ఈ మోదకం తయారు చేయడం విశేషం. ఆయుర్వేద పద్ధతులు మరియు శాస్త్రీయ రీతులతో తయారు చేయబడింది. వారు ఈ మోదకాన్ని తాటి బుట్టలో భద్రపరచి పూజా మందిరానికి తరలించారు.

పిడుగుపడి నాలుగు ఆవులు మృతి


మృతి చెందిన ఆవులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఖీలో

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ కందెల్ గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగుపడి 4 ఆవులు మృతి చెందాయి. ఆవులు ఉంచిన శాలపై వర్షంకు పిడుగుపడి కూలిపోయింది. చిత్రకొండ ఎమ్మెల్యే మాంగు ఖీలో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి

కొరాపుట్: పిడుగుపాటుతో మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని నబరంగ్‌పూర్ జిల్లా బీజేడీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి సోమవారం పరామర్శించారు. చందాహండి సమితి దలాబెడా గ్రామంలో మనోజ్ నాగ్ అనే యువకుడు పిడుగుపడి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. చాలా సంవత్సరాలుగా ఆయన బీజేడీ కార్యకర్తగా పనిచేస్తున్నాడు. దీంతో ఆర్థిక సాయం అందజేశారు. రమేష్ పాటు జిల్లా పరిషత్ సభ్యులు, సమితి సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తోలేటి వాసు ఆచారికి చెందిన రేకుల ఇల్లు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం చుట్టుముట్టాయి. క్షణాల వ్యవధిలోనే మొత్తం కాలిపోయాయి. నిత్యావసర వస్తువులు, సరుకులు, ఫ్రిడ్జ్, ఇన్వెర్టర్, గ్యాస్ సిలెండర్, ఫ్యాన్లు మొత్తం దగ్ధమైపోయాయి. ఫైర్ సిబ్బంది కమలాకర్‌నాయుడు, రామలక్ష్మణ్, రాము, పైల అశోక్‌లు మంటలను అదుపుచేశారు. రెవెన్యూ సిబ్బంది రత్నకర్, వీఆర్వో గోవిందరావు, బాస్కరరావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విశ్రాంత ఉద్యోగికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఫరీదుపేట పంచాయతీ కొయ్యారాళ్ల కూడలి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగి వసంతరావుకి గాయాలయ్యాయి. శ్రీకాకుళం పట్టణం బ్యాంకర్స్ కాలనీకి చెందిన ఈయన చిలకపాలెం వైపు నుంచి శ్రీకాకుళం పట్టణం బైక్‌పై వస్తున్నారు. బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ముఖం, శరీరంలో ఇతర భాగాలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం చేరవేశారు. క్షతగాత్రుడిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

అగ్నిప్రమాదంలో మూగజీవాలు బలి

కవిటి: మండలంలోని నెలవంకలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన దుర్గాశి శ్యామల అనే మేకల పెంపకందారుకు చెందిన మూగజీవాలు ఈ అగ్నిప్రమాదంలో మృత్యువాత పడినట్టు స్థానికులు చెబుతున్నారు. వీటి విలువ రూ.1.5లక్షలుగా ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం స్పష్టమైన కారణం తెలిసిరాలేదు.

మల్లన్న భూమి కౌలుకు వేలం

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానానికి చెందిన భూమి కౌలుకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. సర్వే నంబర్ 142/6 లో 3.46 సెంట్లు, 143/9లో 1.53 సెంట్లు కలిపి మొత్తం 4.99 సెంట్లు భూమికి సంబంధించి మూడేళ్ల కాల పరిమితికి కౌలుకు తీసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహించారు. ఈఓలు వి.రాధాకృష్ణ, టి.రవి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఏడాదికి రూ.86,100 చొప్పున దాసరి లక్ష్మణరావు పాటను కైవసం చేసుకున్నారు.

విన్నపాలు వినవలే..!

- సుదీర్ఘ కాలం తర్వాత ప్రజా ఫిర్యాదుల విభాగం
- వినతులు స్వీకరించిన సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో సుదీర్ఘ కాలం తర్వాత ప్రజా ఫిర్యాదుల విభాగం మరలా ప్రారంభమైంది. నూతన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 2008 తర్వాత 16 ఏళ్ల అనంతరం బాధితులు ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు విన్నవించుకునే అవకాశం దక్కింది. స్థానిక యూనిట్ 6 ప్రాంతంలో ఉన్న ప్రజాభియోగ శిబిరంలో ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ మరియు ఇతర మంత్రులు పాల్గొన్నారు. సమస్యలు తెలిపేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి విశేష సంఖ్యలో పీడిత ప్రజానీకం తరలివచ్చారు. ముఖ్యమంత్రి హాజరుకు ముందు నుంచి ఫిర్యాదు నమోదు ప్రక్రియ ప్రారంభించారు. దీని కోసం బాధిత వర్గం ఎగబాకింది. శిబిరం ప్రాంగణం దాటి ఆరుబయట నడిరోడ్డు మీదకు బాధితులు బారులు తీరారు. ముఖ్యమంత్రి పిలుపు కోసం గంటల తరబడి నిరీక్షించారు. ప్రజల గోడుని సీఎం ప్రత్యక్షంగా ఆలకించారు. ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగించాలని రాష్ట్రంలో తొలిసారి ఏర్పాటైన పాలన పగ్గాలు చేపట్టిన బీజేపీ సర్కారుకు సామాన్య ప్రజానీకం అభ్యర్థించింది.


దివ్యాంగుని విన్నపం స్వీకరిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి


మండుటెండలో బారులుతీరిన ప్రజలు


విన్నపాల నమోదు కోసం ఎగబడుతున్న సాధారణ ప్రజానీకం

అదుపుతప్పి లోయలో పడిన కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

రాయగడ: జిల్లాలోని అంబొదల పోలీసుస్టేషన్ పరిధి బంధుగుడ గ్రామ సమీపంలో అదుపుతప్పి కల్వర్టుని ఢీకొని లోయలో కారు పడిపోయిన దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు దులుం మణికంఠగా గుర్తించగా, గాయాలైనవారిలో బోని శైలేష్, నందరాజు, ఎ.శ్రీనివాస్‌లు ఉన్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా హిచారిపేట పోలీసుస్టేషన్ పరిధి చీనబెడి గ్రామానికి చెందిన దులుం మణికంఠ, బోని శైలేష్, నందరాజు, ఎ.శ్రీనివాస్, చేలూరి సంజీవ్ కుమార్‌లు ఒక కారులో ఒడిశాలోని బరాఘడ్‌కు విందు భోజనానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జిల్లాలోని అంబొదలకు సమీపంలో బంధుగుడ వద్ద ఎదురుగా వస్తున్న ఒక లారీని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొని సుమారు 20 అడుగుల లోయలోకి కారు పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జవ్వగా దులుం మణికంఠ అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న శైలేష్, నందరాజు, శ్రీనివాస్‌లు తీవ్రగాయాలకు గురయ్యారు. అదే కారులో ప్రయాణించిన చేలూరి సంజీవ్ కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.


గాయాలు పాలైనవారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

సమాచారం తెలుసుకున్న అంబొదల పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం అంబులెన్స్‌లో అంబొదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కారులో ఇరుక్కుపోయిన మణికంఠ మృతదేహాన్ని రెండు గంటల పాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది బయటకు తీశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన


నృత్యాలతో స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

కొరాపుట్: జిల్లాలోని పొట్టంగి నియోజకవర్గం ఎమ్మెల్యే రాంచంద్ర ఖడం సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. సోమవారం తుభా సేవాశ్రమ విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ బాలలకు అందుతున్న వసతులు పరిశీలించారు. వారి ఆహారం, విద్యా సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. నందపూర్ సమితిలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నాణ్యత, సాంకేతికతో విద్యార్థులు ప్రయోజనం పొందేలా బోధనలు జరగాలని ఉపాధ్యాయులకు నిర్దేశించారు. ఎమ్మెల్యేకు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు గిరిజన నృత్యాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కొత్త న్యాయ చట్టాలపై

అవగాహన కల్పిస్తాం

- డీఐజీ చరణ్ సింగ్ మీనా

కొరాపుట్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని సదరన్ వెస్ట్రన్ రేంజ్ డీఐజీ చరణ్ సింగ్ మీనా తెలిపారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలకు తెరపడిందన్నారు. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయన్నారు. భారత శిక్షా స్మృతి (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసిజర్ (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టాలకు జూన్ 30 అర్ధరాత్రిలో కాలం చెల్లిందని పేర్కొన్నారు. ఇకపై కేసుల నమోదులో సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేస్తామన్నారు. కేసుల విచారణలో ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్, డిజిటల్ నెట్‌వర్క్‌లకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. బాధితులు సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత నేర ప్రాంత పోలీసుస్టేషన్‌కు కేసు బదలీ చేసుకోవచ్చన్నారు. అత్యాధునిక పరిజ్ఞానం ఇకపై కేసుల్లో వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా ఎస్పీ అభినవ శంకర్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శుంట, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలేటెందు రంజన్ శెరి తదితరులు పాల్గొన్నారు. అలాగే నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో నబరంగ్‌పూర్ ఎస్పీ రోహిత్ వర్మ ప్రసంగించారు. సమావేశంలో డీఎస్పీ రాజ్‌కిషోర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: భారత నూతన నేర శిక్షాస్మృతి చట్టాలు అమలుపై స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. డీఎస్పీ అలోక్ రంజన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరవ్వగా, న్యాయవాదులు స్వరూప్ పాలో, సీనియర్ అడ్వకేట్ హీరాచంద్ దాస్‌లు పాల్గొన్నారు. ఐఐసీ ప్రశాంత్ భూపతి సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ హీరాచంద్ మాట్లాడుతూ కొత్త నేర శిక్షాస్మృతి చట్టాలను వివరించారు. ముఖ్యంగా సీఆర్‌పీసీ 111, 304, 113 చట్టాలు జూలై ఒకటి నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. భారతీయ సీనియర్ సిటిజన్ సురక్షా కమిట్‌మెంట్, కొన్ని క్రిమినల్ కేసుల్లో జిల్లా ఎస్పీకి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు అధికారాలు చట్టంలో పొందుపరచారన్నారు. డీఎస్పీ అలోక్ రంజన్ నాయక్, వివిధ నూతన సెక్షన్లు, సీఆర్‌పీసీపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు.


పర్లాకిమిడి: మాట్లాడుతున్న డీఎస్పీ అలోక్ రంజన్ నాయక్


పర్లాకిమిడి: నూతన సెక్షన్లపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ అడ్వకేట్ హీరాచంద్


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ వర్మ


కొరాపుట్: మాట్లాడుతున్న డీఐజీ చరణ్ సింగ్ మీనా తదితరులు

'కిడ్నీ వ్యాధులపై పరిశోధన కొనసాగిస్తున్నాం'

కవిటి: ఉద్దానం ఎండోమిక్ నెఫ్రోపతిపై గతంలో చేపట్టిన పరిశోధనలు కొనసాగిస్తున్నామని నెఫ్రాలజిస్టు, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ వివేకానంద ఝా అన్నారు. సోమవారం ఈ మేరకు కవిటి సీహెచ్‌సీలో కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల ప్రభుత్వ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బి.అశోక్‌ను రామయ్యపుట్టుగలోని ఆయన స్వగృహంలో కలిసి ఈ అంశంపై మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో అంతుచిక్కని కారణాలతో భయాందోళనలు సృష్టిస్తున్న కిడ్నీవ్యాధులపై గతంలో ప్రారంభించిన పరిశోధనలు మళ్లీ విస్తృతం చేయనున్నామని తెలిపారు. ప్రధానపుట్టుగ, శ్రీరాంపురం గ్రామాలను సందర్శించి పరిశోధన కార్యకలాపాలను పరిశీలించారు. జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రొఫెసర్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ పూర్వాధ్యక్షుడు ప్రొఫెసర్ వివేకానంద్ ఝా, దీర్ఘకాల కిడ్నీ వ్యాధి (ఇఓఈ) నిర్వహణ, చికిత్సపై వైద్యులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఇఓఈ భారం 21% ఉందని, ఈ వ్యాధి మూలకారణాన్ని కనుగొనడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నట్లు ఆయన వివరించారు. కొలంబియా మెడికల్ సెంటర్, యునైటెడ్ స్టేట్స్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌తో కలిసి నిర్వహిస్తున్న ప్రస్తుత ప్రాజెక్టు గురించి ఆయన సమాచారం ఇచ్చారు.


ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్‌తో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వివేకానంద

గిరిజనులకు 80 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ

మెళియాపుట్టి: గిరిజనులు అతి తక్కువ పెట్టుబడితో అత్యధిక ఆదాయం పొందేవిధంగా కొత్తూరు వెలుగు అసోసియేషన్ సహకారం అందిస్తుందని పలువురు అసోసియేషన్ సభ్యులు అన్నారు. సోమవారం మండలంలోని గొడ్డగ్రామంలో కేరాసింగి, నేలబొంతు, ఆంజనేయపురం, పొగడవెల్లి, గొడ్డ గ్రామంలో 80శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. గిరిజనుల భూముల్లో పండించడానికి అనువైన కొండచీపుర్లు, చిరుధాన్యాలు, కూరగాయలు పలురకాల విత్తనాలను అందించారు. కేరాసింగి సర్పంచ్ పెద్దబొంతు ఆది లక్ష్మి మాట్లాడుతూ 2018 నుంచి మండలంలోని గిరిజనులకు అవసరమైన విత్తనాలను కొత్తూరు వెలుగు అసోసియేషన్ అందిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధికి ఇలాంటి సహాయ సహకారాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పెదబొంతు అప్పారావు, పలువురు ఏరియా కోర్డినేటర్లు, సీసీ జగన్, మొబలైజర్స్ కళ్యాణి, హరిశ్చంద్ర ఉన్నారు.


కొత్తూరు వెలుగు అసోసియేషన్ వారు అందించిన విత్తనాల ప్యాకెట్లను చూపిస్తున్న గిరిజనులు

శివారుకు సాగునీరిస్తాం: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్


శ్రీకాకుళం పాతబస్టాండ్: వంశధార నీటిని వజ్రపుకొత్తూరులోని శివారు భూములకు అందించడమే లక్ష్యంగా పని చేయాల ని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా పూర్తిస్థాయిలో పూడిక తీత, తుప్పల తొలగింపు పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ అధికారులతో కలిసి ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది కాలువ భూములకూ సాగునీరు అందించాలనే లక్ష్యంలో భాగంగానే వంశధార రిజర్వాయర్ నుంచి సోమవా రం నీటిని విడుదల చేశామని చెప్పారు. షట్టర్ల సమస్యలు ఉన్న చోట్ల ఇసుక బస్తాలతో తాత్కాలి కంగా అడ్డుకట్ట వేశామని, మంగళవారం మధ్యాహ్నానికి పలాస జగన్నాథ సాగరం వరకూ నీటిని తీసుకువెళ్తామని వంశధార ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రానున్న వారం రోజులూ వంశధార కాలువలు, ఇతర ఇరిగేషన్ కాలువలపై పూర్తిస్థాయిలో పనులు జరగాలని, వీటికి ఉపాధి హామీ పథకం కింద గ్రాంటు మంజూరు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్ కింద ఖర్చు పెట్టే అవకాశం ఉన్న పనులను ఆయా ప్రజా ప్రతినిధులతో కలిసి గుర్తించాలని సూచించారు. ఆయా గ్రామాలకు సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, ఇతర శాశ్వత ప్రయోజనం కలిగే పనులను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు అందజేయాలని, రానున్న వారం రోజుల్లోపు పంచాయతీరాజ్ ఎస్ఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈలు తమ సిబ్బందితో అంచనాలను రూపొందించాలని అన్నారు. పనులు జరగకుండా బిల్లులు చేసినా, ఉపాధి పనుల్లో మస్టర్ విషయంలో అవకతవకలు జరిగినా ఆయా సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఒకటో తేదీనే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఒక్క రోజులోనే 97 శాతం లక్ష్యాన్ని సాధించగలగామని, ఈ విషయంలో రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో ఉన్నామని కలెక్టర్ ఈ సందర్భంగా ఎంపీడీఓలను అభినందించారు. సమావేశంలో డ్వామా పీడీ చిట్టి రాజు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఆర్ వెంకట్రామన్, వంశధార ఈఈ శేఖర్, ఉద్యానవన శాఖాధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేవేల లాభాల వేప

- పంట సాగులో వేప ఉత్పత్తుల వినియోగం
- తెగుళ్ల నివారణలో కీలక పాత్ర
- వేపతో 300 కీటకాలు నాశనం
- రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గిస్తే మేలు


వేప కాయలు


ముడి సరుకు లభించే వేప చెట్టు

వజ్రపుకొత్తూరు: రైతులకు వేప ఉత్పత్తులు సాగులో సాయం చేస్తున్నాయి. వేప చెట్టులో వేరు మొదలు బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలు ఇలా సమస్తం ఔషధ గుణాలతో నిండి ఉంటాయి. వీటిని వినియోగించడం వల్ల పంటకు బలం చేకూరడమే కాకుండా.. భూమికి కూడా సత్తువ కలుగుతుంది. రసాయన ఎరువులు వినియోగించడం వల్ల ఫలసాయంతో పాటు భూసారం కూడా తగ్గుతుంది.

తెగుళ్ల నివారణ ఇలా...

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేప పిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లి కోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ఆ ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తొడిమి కుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. మిర్చి మీద వచ్చే జెమిని వైరస్ కూడా అదుపులో ఉంటుంది. వేరుశనగపైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కా ఆకుపచ్చ తెగులు, టమాటో సాగులో ఎండు తెగులును వేప నూనెతో నివారించవచ్చు.

ఇంటిలోనే కషాయం తయారీ

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంటిలోని మహిళలే తయారు చేసుకోవచ్చు. ఐదు కిలోల వేప గింజలు నలగ్గొట్టి, 6 నుంచి 7 లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు రోజులు నాటబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి.

వేపతో 300 రకాల కీటకాలు నాశనం

వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు,నల్లి జాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమతోడ్స్, కొన్ని రకాల బూజు శిలీంద్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేప నూనె, వేప కషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

కీటకాల నివారణే కీలకం

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు స్ప్రే చేసినపుడు పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. ఈ మందు పక్షులు, మానవులు, మిత్రపురుగుల, తేనెటీగలు వంటి జీవ రాశులకు హాని చేయదు. సమగ్ర సస్యరక్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి. పరుగుల మందులు, శిలీంద్ర నాశినులతో వేపను కలిపి సురక్షితంగా స్ప్రే చేసుకోవచ్చు.

ఇదే అనుకూల సమయం

పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేప మందు స్ప్రే చేయాలి. తల్లిపురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయంలో (ఉదయం, సాయంత్రం) పిచికారీ చేయాలి. 7 నుంచి 15 రోజుల వ్యవధిలో ఈ పని పూర్తి చేయాలి. పిచికారీ చేసిన తర్వాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే.

రైతులు వినియోగిస్తే మంచి ఫలితాలు



ఉద్యానవన పంటల్లోనే కాకుండా వరి సాగులో వేప పిండి, నూనె తదితర ఉత్పత్తులు అధికారుల సూచనలతో వాడితే మంచి ఫలితాలు వస్తాయి. నేను కూరగాయలు, కొబ్బరి సాగులో వినియోగించాను. ఆశించిన మేర ఫలితాలు వచ్చాయి. ఐతే కొంచెం ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచన పాటించి వాడాలి. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వేప పిండి, సంబంధిత ఉత్పత్తులు సబ్సిడీలపై అందిస్తే సేంద్రియ వ్యవసాయం వైపు వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది.

– కె.గిరిబాబు, రైతు అమలపాడు

వేప మంచి కీటక నాశిని



వేప వరి పైరులో మంచి కీటక నాశిని. ఐతే మన ప్రాంతంలో వాస్తవానికి అధికంగా రసాయన ఎరువులను రైతులు వినియోగిస్తున్నారు. వేప ఉత్పత్తులను వినియోగించి సాగు చేస్తే చాలా మంచి ఫలితాలు ఉంటాయి. ఐతే వాటి ఉత్పత్తుల ధరలు చూస్తే చాలా ఎక్కువగా ఉంటాయి. నూనె తీయగా మిగిలిన వేప చెక్క ఎండిన వేప ఆకులు, కాయలను దంచగా వచ్చే పిండిని వరి దమ్ములో వినియోగిస్తే ఎంతో మంచిది. ప్రస్తుతం వేప ఉత్పత్తులకు వ్యవసాయ శాఖ నుంచి ఎలాంటి సబ్సిడీ లేదు.

– ఎల్‌వీ మధు, ఏడీఏ, వ్యసాయ శాఖ, పలాస

క్లుప్తంగా

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు సోయవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ యాజమాన్యం లోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత, ఆసక్తిగల ఉపాధ్యాయుల నుంచి 2024 పురస్కారాలకు హెచ్‌టీటీపీ ://నేషనల్‌అవార్ట్స్‌టూచర్. ఎడ్యుకేషన్.జీఓవీ.ఇన్ ఆన్‌లైన్‌లో స్వీయ నామినేషన్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. జూన్ 27 నుంచి ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవాలేని కేంద్ర మంత్రిత్వశాఖ, పాఠశాల విద్యాశాఖా శాస్త్రి భవన్, న్యూఢిల్లీ వారు తెలిపారన్నారు. కావున అర్హత గల ఉపాధ్యాయులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. దరఖాస్తు ప్రతిని పరిశీలన నిమిత్తం కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

జాబ్‌మేళాకు స్పందన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టీవీ గిరి

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, టీవీఎస్ సుందరం ఫాస్టనర్స్, క్యూసెప్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, రేడియంట్ ఎలక్ట్రానిక్స్, టీసీఎస్, జీవై సొల్యూషన్స్, పిట్టి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరై 485 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూకు 410 మంది అభ్యర్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉద్యోగం సాధించిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

గౌరీపురంలో ఏనుగుల సంచారం



గౌరీపురం పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గౌరీపురం, చినకుదమ,పెదకుదమ గ్రామాల పంట పొలాల్లో సోమవారం ఏనుగులు సంచరించాయి. ఆయా గ్రామాల్లో అరటి పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరు ఏనుగుల గుంపు కుదమ పంచాయతీలో సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎనిమిది ఏనుగులకు గాను హరి ఏనుగు కనిపించడం లేదు. వెంకటలక్ష్మి అనే ఏనుగు ఇటీవల మృతి చెందడంతో మిగిలిన ఆరు ఏనుగులు గ్రామాల్లో సంచరిస్తున్నాయి. ఏనుగులను అడవిలోకి పంపించే ఏర్పాట్లు చేయాలని అటవీ సిబ్బందిని రైతులు కోరుతున్నారు.

జేఎన్‌టీయూ జీవీ వీసీ రాజీనామా..?

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య సోమవారం రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేశ్ పలు యూనివర్సిటీల వీసీలపై రాజీనామాకు ఒత్తిడి చేసిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ వీసీల చాంబర్లకు టీడీపీ కార్యకర్తలు వెళ్లి దుర్భాషలాడి అవమానించిన సంఘటనలు రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో జరిగాయి. దీంతో కొన్ని యూనివర్సిటీల వీసీలు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇక్కడి జేఎన్‌టీయూ జీవీ వీసీ ఇంకా రాజీనామా చేయకపోవడంతో మంత్రి లోకేశ్ ఆయనపై సోమవారం సీరియస్ అయినట్లు సమాచారం. రాజీనామా చేయకపోతే మిమ్మల్ని తప్పించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారని తెలుస్తోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చినట్లు ప్రచారంలో ఉంది.

టోల్‌ప్లాజాను మూసివేయాలి

డెంకాడ: మండలంలోని జొన్నాడ సమీపంలో విజయనగరం - విశాఖ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను వెంటనే ఎత్తివేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, పౌరవేదిక ప్రతినిధులు, ప్రజలు టోల్‌ప్లాజా వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్లే వాహనాల నుంచి టోల్ వసూలు చేయాలనుకుంటే చెల్లూరు వద్ద నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా ఏర్పాటు చేయాలే గాని.. విజయనగరం-విశాఖ రహదారిపై ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఇక్కడ టోల్‌ప్లాజా ఏర్పాటు చేయడం వల్ల విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు నష్టపోతారన్నారు. విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గెలిచిన వెంటనే శివాజీపాలెం వద్ద టోల్‌ప్లాజాను లేకుండా చేశారని.. ఆ దిశగా ఇక్కడ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగారపు ఈశ్వరప్రసాద్, వివిధ విభాగాల ప్రతినిధులు పీడకల ప్రభాకరరావు, అచ్చిరెడ్డి, కరుణాకర్, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి

• కలెక్టర్ నిషాంత్‌కుమార్



పార్వతీపురం: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



విజయనగరం అర్బన్: అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జేసీ కార్తీక్



పార్వతీపురం టౌన్: అర్జీ దారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



పిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీవో తదితరులు

పార్వతీపురం: జిల్లాలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మొదటి రోజే పూర్తిచేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను అదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్‌ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడులు ప్రజల నుంచి 121 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెన్షన్ల పంపిణీ వెంటనే పూర్తిచేయాలని, మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. శానిటేషన్, కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. వర్షాలు పడి కాలువలలో నీరు చేరిన మూలంగా తాగునీరు కలుషితమయ్యే పరిస్థితి ఉందని, మంచి నీటి పైపులు తనిఖీ చేసి ఎక్కడైనా లీకులు ఉంటే పైపులు మార్చాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ చేతులు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టాలని, చేతులు ఎలా శుభ్రపరచుకోవాలో పిల్లలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె రామచంద్ర రావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ విక్రాంత్ పాటిల్ 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తెలియపరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సై గోవింద రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 14 వినతులు

సీతంపేట: ఏపీవో ఎస్‌వీ గణేష్ ఆద్వర్యంలో సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 14 వినతులు వచ్చాయి. సంకిలికి చెందిన సవర లింగయ్య చీపుళ్ల యూనిట్ పెట్టుకోవడానికి రుణం మంజూరు చేయాలని, భాషా వలంటీర్ పోస్టు ఇప్పించాలని సవర సుశీల వినతులు అందజేశారు. బీటెక్ చదువుకోవడానికి ఆర్థిక సాయం చేయాలని దుగ్గికి చెందిన జ్యోతిక వినతిపత్రంలో కోరింది. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నాదొర, ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈవో నారాయుడు, పీఏవో హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి: కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: ప్రభుత్వానికి, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన జిల్లా అధికారులు సమయపాలన పాటించాలి. ఇంకోసారి ఆలస్యంగా హాజరైతే తలుపులు వేయాల్సి వస్తుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ అధికారులపై సీరియస్ అయ్యారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ' వినతుల స్వీకరణ కార్యక్రమానికి పలువురు జిల్లా అధికారులు ఆలస్యంగా రావడంపై ఆయన పై విధంగా వ్యాఖ్యానించారు. వినతుల స్వీకరణ కార్యక్రమానికి ఉదయం 9.45 గంటలకు రావాలని ముందురోజు అధికారులకు సమాచారం పంపారు. అయితే గతంలోని టైమింగ్ ప్రకారం కొంతమంది ఉదయం 10 గంటలు దాటాక వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైస్థాయి నుంచి కిందిస్థాయి అధికారుల వరకు సమయాపాలన పాటిస్తూ క్రమశిక్షణతో, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సమయాపాలన పాటించని అధికారులను సంబంధిత సమావేశానికి అనుమతించనని స్పష్టం చేశారు. కలెక్టర్ అనుమతి లేకుండా ప్రధాన కేంద్రం విడిచి అధికారులు వెళ్లడం కానీ, సెలవుపై వెళ్లడం కాని చేయరాదని, ఇతర సమావేశాలకు వెళ్లాల్సి వచ్చినా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని తేల్చి చెప్పారు.

ప్రజావినతుల పరిష్కార వ్యవస్థకు 139 అర్జీలు

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 139 వినతులు అందాయి. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు మురళీకృష్ణ, రాజేశ్వరి, ప్రమీల, నూకరాజు తదితరులు వినతులను స్వీకరించారు.

ఎస్పీకి 43 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యలు తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి 43 పిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, పిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డిటిసి డీఎస్పీ ఎం.వీరకుమార్, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ ఈ.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

• ఎస్పీ ఎం.దీపిక



జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన చట్టాల కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక



రూరల్ పోలీసు స్టేషన్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఆర్.గోవిందరావు



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నూతన చట్టాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరైన ప్రజలకు నూతన చట్టాలపై సోమవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్‌ఎస్), సీఆర్‌పీసీ చట్టాన్ని భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), అదేవిధంగా ఎవిడెన్స్ యాక్ట్‌ను భారతీయ సాక్ష్యఅధినియమం చట్టాలుగా మార్పు చేశారన్నారు. ఐపీసీలో 511 చట్టాలు ఉంటే వాటిని బీఎన్‌ఎస్‌లో 358కి తగ్గించారని చెప్పారు. అదే విధంగా సీఆర్‌పీసీలో 484 వరకూ ఉంటే వాటిని బీఎన్‌ఎస్‌ఎస్‌లో 531కి పెంచారని, అలాగే ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో 167 చట్టాలు ఉంటే వాటిని బీఎస్‌ఎలో 170కి పెంచారన్నారు. కేంద్రప్రభుత్వం అందరికీ అవసరమైన, ఆమోదయోగ్యమైన చట్టాలను ఏర్పాటు చేసిందని వివరించారు. జిల్లా పోలీస్‌శాఖతో ఉన్న ప్రతి ఒక్కరితో పాటు ప్రజలందరూ వీటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీ ఎం.వీరకుమార్, డీసీఆర్‌బీ సీఐ జి.మురళి, ఎస్బీ సీఐ ఈ.నరసింహమూర్తి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అందరికీ ఆమోదయోగ్యంగా నూతన చట్టాలు

ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా నూతన చట్టాలు రూపకల్పన చేశారని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు పేర్కొన్నారు. ఈ మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నూతన చట్టాలతో బుక్‌లెట్ ఆవిష్కరణ

నూతన చట్టాలతో రూపకల్పన చేసిన ప్రత్యేక బుక్‌లెట్‌ను వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఆవిష్కరించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతన చట్టాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌పడాల్, హరిబాబు ఎనాయుడు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



మహారాజా ప్రభుత్వ సంగీత,నృత్య కళాశాల

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీవీఎల్ ఎస్.శాస్త్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమో కోర్సులో శిక్షణకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సు పరీక్షలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే డిప్లమో కోర్సులో చేరేందుకు అర్హులని సూచించారు. విద్యార్థులు గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, భరతనాట్యంలో శిక్షణ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పదేళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులని, ఆసక్తి గల విద్యార్థులు 08922-223751 నంబర్‌ను కానీ నేరుగా కళాశాలలో గానీ సంప్రదించాలని కోరారు.

• విద్యార్థుల ఆందోళన



పట్టణంలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

• జ్యోతి ఐటీఐ కళాశాలను పరీక్ష కేంద్రంగా గుర్తించాలి
• ఎస్ఎఫ్ఐ డిమాండ్
• కలెక్టరేట్ వద్ద ధర్నా

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రం లేకపోవడం అన్యాయమని వెంటనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. రాజు, డి.పండు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీఐ విద్యార్థులతో కలిసి పాత బస్టాండ్ నుంచి కాంప్లెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సందర్భంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లి రాయవలసి వస్తోందని ఇది చాలా అమానుషమన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట ప్రాంతాలలో మూడు ప్రభుత్వ, ఐదు ప్రేవేట్ ఐటీఐ కళాశాలలున్నాయని, వాటిలో సుమారు మూడు వేలమంది విద్యార్థులు ఐటిఐ చదువుతున్నారన్నారు. పరీక్షల సందర్భంలో ఈ విద్యార్థులు రాజాం, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాసే పరిస్థితి ఏర్పడుతుందని, దాని వల్ల విద్యార్థులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్యను గుర్తించిన ఎస్ఎఫ్ఐ పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల జ్యోతి ఐటీఐ (ప్రైవేట్) కళాశాలలో సుమారు 500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు సరిపడా తరగతి గదులు, 100 కంప్యూటర్లు, ల్యాబ్‌లు, తదితర అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని గుర్తించి గతంలో డీఆర్‌ఓ కేశవ నాయుడికి విన్నవించగా డీవీఈఓ ద్వారా రాతపూర్వక సమాచారం కోరారని, ఆనాటి నుంచి నేటివరకు ఎటువంటి స్పందనలేదని వాపోయారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల జ్యోతి ఐటీఐ (ప్రైవేట్) కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అఖిల్, జి.సురేష్ అజయ్, వినోద్ , రాకేష్,సూర్య పాల్గొన్నారు.

పైడితల్లి ఆదాయానికి గండి

• సర్వర్ సమస్యతో టికెట్ల ఆదాయం నిల్
• రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య అంటున్న అధికారులు



సర్వర్ సమస్యతో ఖాళీగా దర్శనమిస్తున్న టికెట్ కౌంటర్



పైడితల్లి అమ్మవారి ఆలయం

విజయనగరం టౌన్: కొత్తప్రభుత్వం రాకతోనే ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కలవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆదాయానికి రెండు రోజులుగా గండి పడింది. టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఆన్‌లైన్ సమస్య వచ్చిపడింది. దీంతో అమ్మవారి అంతరాలయ దర్శనంతో పాటు ప్రసాదాలు, నిత్యన్నదాన విరాళాలు, శ్రీ చక్ర కుంకుమార్చనలు ఇలా ప్రతి సేవా టికెట్లు ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. ఒక్కరోజులో సుమారు రూ. లక్షా 50వేల వరకూ ఆదాయం అమ్మవారికి టికెట్ల రూపంలో వస్తూ ఉంటుంది. అయితే రెండు రోజులుగా ఇదే సమస్య ఉత్పన్నం కావడంతో అధికారులు చేతులెత్తేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉందని, తమచేతుల్లో ఏమీ లేదని స్పష్టం చేస్తున్నారు. కనీసం సాధారణ టికెట్లు కూడా ఇవ్వకుండా హుండీల్లో డబ్బులు వేసేయండంటూ భక్తులకు ఉచిత సలహాలు మాత్రం సిబ్బందితో ఇప్పిస్తున్నారు. భక్తులు కూడా చేసేది లేక సేవలకు టికెట్లు లేకపోవడంతో ప్రసాదాలను కొనుగోలు చేయడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. పైడితల్లి అమ్మవారికి ఎక్కువగా నిత్యాన్నదానం, అష్టోత్తర సేవలు, ప్రసాదాలు, అంతరాలయ దర్శనాల రూపంలో రూపంలో ఆదాయం లభిస్తుంటుంది. భక్తులకు సరైన సమయంలో కనీసం టికెట్‌లు కూడా ఇవ్వకుండా అధికారులు చోద్యం చూడడమే కనబడుతోంది. ఈ విషయమై ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావును వివరణ కోరగా ఆదివారం మధ్యాహ్నం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా టీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో సమస్య వచ్చిందని, త్వరలోనే బాగుపడుతుందని అధికారులు చెబుతున్నారన్నారు., మరికొద్ది గంటల్లో దీనికి పరిష్కారం దొరుకుతుందని చెప్పారు.


డీఆర్‌ఓగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



డీఎఫ్‌ఓ వెంకటేష్‌ను కలిసిన డీఆర్‌ఓ సుబ్బారావు

విజయనగరం ఫూల్‌బాగ్: అటవీశాఖ విజయనగరం డివిజన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా బి.సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజులను కలిశారు. ఇక్కడ డీఆర్‌ఓగా పనిచేసిన ప్రహ్లాదరావు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై శ్రీకాకుళం వెళ్లారు. ఆ స్థానంలో సుబ్బారావు నియమితులయ్యారు. ఆయన ఇంతవరకు అనకాపల్లి డివిజన్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా అటవీసిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓలు శ్రీను, రామారావు పాల్గొన్నారు.

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం



బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన సభ్యులు

విజయనగరం రూరల్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికను సోమవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా డి.జగదీశ్వర రావు, చైర్మన్‌గా ఇందుకూరి రఘురాజు, చీఫ్ పేట్రన్‌గా ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, చీఫ్ అడ్వయిజర్‌గా బెల్లాన చంద్రశేఖర్, అధ్యక్షుడిగా కేపీ నాయుడు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వీఎస్ ప్రసాద్, మరో 23 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆరుబయట మందులు



ఆయుష్మాన్ కేంద్రం ఆరుబయట పడేసిన ఖరీదైన మందులు, ఇతర కిట్లు

గజపతినగరం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించాలనే సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్మాణం చేసిన భారత్ ఆయుష్మాన్ భవ కేంద్రాలలో ప్రభుత్వం మారగానే సిబ్బంది ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కొత్తబగ్గాం గ్రామ ఆయుష్మాన్ భవన్ కేంద్రంలో రోగులకు అందించాల్సిన మందులను ఆస్పత్రి బయట పడేసి చోద్యం చూస్తున్నారు.ఈ కేంద్రాలపై పర్యవేక్షణ కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు.ఎంతో ఖరీదైన మందులను వృథాగా ఆరుబయట పడేయడంపై సిబ్బంది నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కనబడుతోంది. ఈ విషయమై సంబంధిత ఏఎన్ఎం, ప్రభావతి వద్ద సాక్షి ప్రస్తావించగా తాను పెన్షన్ల పంపిణీకి వెళ్లి వచ్చానని కేంద్రానికి మందులు రావడంతో సిబ్బంది వాటిని సర్దే క్రమంలో చూసుకోక కొన్నింటిని బయట పడేశారన్నారు.

మా పేరునే భూమికి పరిహారం ఇవ్వండి



అర్జీ వింటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

• కలెక్టర్‌కు నిర్వాసితుల విజ్ఞప్తి

విజయనగరం అర్బన్: గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం కోసం ఇచ్చిన సాగుభూమికి హక్కుదారులుగా పరిహారం తమకే ఇవ్వాలని కొత్తవలస మండలంలోని ఉత్తరాపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ గణేష్, గ్రామస్తులు, పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారంతా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోల్పోయిన భూమి మా స్వాధీనంలోనే ఉందని, ఆన్‌లైన్ నమోదు తప్పిదాల వల్ల వేరే వారి పేర్లు ఉన్నాయని దాన్ని సరిచేయాలని కోరారు. తమ భూములకు 1బి, పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేసి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లకు పైగా భూములను సాగుచేసుకుని జీవిస్తున్నామని పేర్కొన్నారు. ఆ భూమి మీద శిస్తు రశీదులు, క్రయ చీటీలు, పురోణీలు ఉన్నాయని భూసేకరణ నోటిఫికేషన్ కూడా మా పేర్ల మీదే ఇచ్చారని తెలిపారు. మా భూములకు ఓ ప్రైవేట్ సంస్థ పాస్‌పుస్తకాలు చేయించుకుందని అధికారులు ఆ సంస్థ ఖాతాకే పరిహారాన్ని జమచేస్తామని చెబుతున్నారని వాపోయారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సింగంపల్లి శ్రీరామ్మూర్తి, సుందరరావు, సర్సింహనాయుడు తదితరులు ఉన్నారు.